సాక్షి కామారెడ్డి

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



ఆధార్ కేంద్రం లేక..

బీబీపేట మండలంలో ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- 9లో ▸



అభివృద్ధికి సహకరిస్తా

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన పలు గ్రామాలలో పర్యటించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.5 /16.2

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రజావాణి వాయిదా

కామారెడ్డి క్రైం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అత్యవసరంగా వినతులు సమర్పించాలనుకునేవారు కలెక్టరేట్‌లోని రూం నంబర్ 25 లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్థాయి వాలీబాల్ శిక్షణకు ఎంపిక



గాంధారి: జాతీయ స్థాయి వాలీబాల్ శిక్షణకు పేట్‌సంగెం గ్రామ పంచాయతీ పరిధిలోని ధన్‌సింగ్ తండాకు చెందిన జర్పుల సోనియా ఎంపికైందని పాఠశాల పీఈటీ లక్ష్మణ్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏటా శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. బెంగళూర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ క్రీడా ప్రాధికార సంస్థలో శిక్షణ ఉంటుందని, సోమవారం ప్రారంభమయ్యే శిక్షణ ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

టీఏఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కృష్ణాగౌడ్




కామారెడ్డి రూరల్: ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్స్ అసోసియేషన్(టీఏఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాడ్వాయికి చెందిన కృష్ణాగౌడ్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన టీఏఏ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని టీఎన్‌జీవోస్ కేంద్ర కార్యాలయంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారని ఆయన తెలిపారు.

12న చలో జంతర్ మంతర్



కామారెడ్డి అర్బన్: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని జాతీయ సెలవుదినంగా ప్రకటించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 12న చలో న్యూఢిల్లీ జంతర్‌మంతర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గిరిజన విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంఘాల ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సబావత్ వినోద్‌నాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నేనావత్ గణేశ్ నాయక్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, తీజ్ మండలి ప్రతినిధులు ప్రవీణ్‌నాయక్, చరణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆశల పల్లకీలో..



రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీతో పాటు పీసీసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తోంది. దీంతో అధికార పార్టీ నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆయా పదవులకోసం ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- ఊరిస్తున్న నామినేటెడ్ పార్టీ పదవులు
- ప్రయత్నాలు ముమ్మరం చేసిన కాంగ్రెస్ నేతలు
- జిల్లాలో పెరుగుతున్న ఆశావహులు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. ఆ పార్టీకి చెందిన చాలామంది నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. అలాగే పార్టీ పదవులకోసమూ ఎదురుచూస్తున్నారు. పీసీసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడంతో పాటు నామినేటెడ్ పదవుల భర్తీ దిశగా అడుగులు పడుతుండడం అలాంటి నేతలకు కొత్త ఉత్సాహాన్నిస్తోంది. జిల్లాలో మొదటి నుంచి పార్టీ కోసం పని చేస్తున్న నేతలెందరో నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవుల కోసం ఆశలు పెట్టుకున్నారు. నామినేటెడ్ పదవులు దక్కకుంటే కనీసం పార్టీ పదవులైనా వస్తాయన్న ఆశతో ఉన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడవడంతో ఏదో ఒక పదవి సాధించాలన్న పట్టుదలతో కొందరు విస్తృతంగా ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో డీసీసీ అధ్యక్షులను మార్చడానికి కాంగ్రెస్ నాయకత్వం ఆలోచనలు చేస్తోంది. జిల్లా ఆవిర్భవించిన నాటినుంచి డీసీసీ అధ్యక్షుడిగా కైలాస్ శ్రీనివాస్‌రావు కొనసాగుతున్నారు. ఈసారి కొత్త వారికి అవకాశం ఇస్తారని భావిస్తున్నారు. కాగా కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన వారికే జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఇవ్వాలన్నది స్థానిక నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మనోగతంగా తెలుస్తోంది. అయితే ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు చెందిన నేతల కోసం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మదన్మోహన్‌రావు, లక్ష్మీకాంతరావు కూడా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై నేతల్లో చర్చ నడుస్తోంది.

'స్థానిక' పదవులపై పలువురి దృష్టి

త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకమైన జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులతో పాటు ఎంపీపీలుగా, జెడ్పీటీసీ సభ్యులుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పలువురు నాయకులు సిద్ధమవుతున్నారు. అయితే జెడ్పీ చైర్మన్ పదవి ఈసారి ఏ సామాజిక వర్గానికి రిజర్వ్ అవుతుందన్న దానిపై ఉత్కంఠతో ఉన్నారు. రిజర్వేషన్ల వెల్లడైతే దానికి అనుగుణంగా పావులు కదపడానికి చాలామంది ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ పదవుల రిజర్వేషన్లు ఎప్పుడు వెల్లడవుతాయన్న దాని గురించి ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కీలకమైన స్థానిక సంస్థలను దక్కించుకునేందుకు ఆ పార్టీ నేతలు వ్యూహాలకు పదును పెడుతున్నారు. రిజర్వేషన్ అంశం కీలకంగా మారడంతో దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకోనున్నారు.

నామినేటెడ్ పదవులకోసం..

రాష్ట్రంలో పదేళ్ల తర్వాత అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్నారు. ఇన్నాళ్లు పార్టీ కోసం పనిచేసిన నేతలు.. ఆయా పదవుల కోసం తమ గాడ్‌ఫాదర్ల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. తొలి విడత రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల పందేరంలో బాన్సువాడకు చెందిన కాసుల బాల్‌రాజ్ ఒక్కరికే రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. తర్వాత జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా భిక్కనూరు మండలానికి చెందిన చంద్రకాంత్‌రెడ్డిని నియమించారు. జిల్లాలోని ఆయా మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, డైరెక్టర్లను నియమించారు. ఇంకా చాలామంది పార్టీ పదవులతోపాటు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు.

ప్రస్తుత జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి కోసం ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కుతుందని ఆశలు పెట్టుకోగా అది చేజారింది. మరేదైనా పదవి దక్కుతుందన్న ఆశతో ఉన్నారు. ఆయన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే కామారెడ్డికి చెందిన న్యాయవాది దేవరాజ్ గౌడ్ నామినేటెడ్ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. భిక్కనూరు మండలానికి చెదిన బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి సైతం నామినేటెడ్ పదవుల రేసులో ఉన్నారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు చెందిన పలువురు నేతలు సైతం ఆయా పదవులు ఆశిస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కోసం చివరిదాకా ప్రయత్నించిన యువ నాయకులు ఐరేని సందీప్, చందులకు నిరాశే ఎదురైంది. వారు ఏదో ఒక పదవి దక్కుతుందని ఆశతో ఉన్నారు.

కచ్చితత్వం కోసం డిజిటల్ క్రాప్ సర్వే

- క్లస్టర్‌కు ఒక గ్రామం ఎంపిక
- పైలట్ ప్రాజెక్టు కింద 102 గ్రామాల్లో సర్వే చేస్తున్న అధికారులు
- సర్వర్ సతాయిస్తుండడంతో ఇబ్బందిపడుతున్న ఏఈవోలు



పోతంగల్‌కలాన్‌లో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

కామారెడ్డి క్రైం: పంటల నమోదులో కచ్చితత్వం కోసం రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టింది. ప్రతి వ్యవసాయ క్లస్టర్ పరిధిలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి పంటల సర్వే నిర్వహిస్తున్నారు. ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సర్వే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. అయితే ఎండలు పెరుగుతుండడం, సర్వర్ మొరాయించడం లాంటివి సర్వేకు ఇబ్బందులుగా మారుతున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో 104 వ్యవసాయ క్లస్టర్లున్నాయి. అయితే డిజిటల్ క్రాప్ సర్వే కోసం 102 క్లస్టర్‌లను ఎంపిక చేశారు. పురుష ఏఈవోలు ఉన్న గ్రామాల్లో 2 వేల ఎకరాలు, మహిళా ఏఈవోలు ఉన్న చోట 1,800 ఎకరాల్లో సర్వే చేయాలని నిర్దేశించారు. ఏటా చేపట్టే సాధారణ పంటల నమోదుతో పాటుగా డిజిటల్ క్రాప్ సర్వేను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను వాడుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా తమకు కేటాయించిన భూములలో సర్వే నంబర్ల వారీగా ఏఈవోలు క్షేత్రస్థాయికి వెళ్లి లొకేషన్, సాగు చేస్తున్న వారి వివరాలు, ఏ పంట వేశారు/సాగులో లేదు అన్న వివరాలు నమోదు చేయాల్సి ఉంది. సాగవుతున్న పంటల వివరాలు కచ్చితత్వం తెలుసుకోవడంతో పాటు ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సంక్షేమ పథకాలకు అంచనాలు తదితర అవసరాలకు పక్కా ప్రణాళికలు రూపొందించేందుకు ఈ సర్వే ద్వారా అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

సర్వే ప్రారంభమైంది..



జిల్లాలోని 102 క్లస్టర్ల పరిధిలో డిజిటల్ క్రాప్ సర్వే పనులు ప్రారంభమయ్యాయి. పంటల నమోదుతో పాటే ఈ సర్వే చేస్తున్నాం. సర్వే సక్రమంగా కొనసాగుతోంది. సర్వే సమయంలో మా దృష్టికి వచ్చిన సమస్యలను టెక్నికల్ బృందాలతో మాట్లాడి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేస్తాం.

– తిరుమల ప్రసాద్, డీఏవో, కామారెడ్డి

సర్వేలో సమస్యలు..

జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రారంభమై ఐదు రోజులు గడిచాయి. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న ఏఈవోలకు అనేక సవాళ్లు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సర్వర్ సతాయిస్తుండడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. క్షేత్ర స్థాయిలో రైతు అందుబాటులో లేకపోవడం, సర్వర్ మొరాయించడం వంటి కారణాలతో సర్వే ముందుకు సాగడం లేదు. ముదురుతున్న ఎండలు కూడా ఇబ్బందిపెడుతున్నాయి. ఒక్కో క్లస్టర్ పరిధిలో రోజుకు 50 నుంచి 60 ఎకరాల వరకు మాత్రమే సర్వే పనులు పూర్తవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు టెక్నికల్ బృందాలతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



కామారెడ్డి అర్బన్: సిద్దిపేటలో ఆదివారం నిర్వహించిన శత సహస్ర యోగా సూర్య నమస్కారాల ప్రదర్శన, రాష్ట్ర స్థాయి సూర్యనమస్కారాల పోటీల్లో జిల్లాకు చెందిన యోగా సాధకులు ప్రతిభ చూపారు. అజయ్ 1,010, ఎల్లయ్య వెయ్యి, రాజు 850 సూర్య నమస్కారాలు చేశారని జిల్లా యోగా, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం యోగా రాంరెడ్డి తెలిపారు. హిమబిందు 634, సంధ్య 540, కౌశిక్ 540, సురేందర్ 415, శర్వాణి 241, హర్షిత 220, సోనియా 128, రాజ్‌కుమార్ వంద, సుదీక్ష వంద సూర్యనమస్కారాలు చేశారని పేర్కొన్నారు. పోటీలలో ప్రతిభ చూపిన వారికి సిద్దిపేట యోగా అసోసియేషన్ ప్రతినిధులు ప్రశంస పత్రాలు, పతకాలు అందించారని తెలిపారు.

కౌలాస్ కోట అద్భుతం



కౌలాస్ కోటను సందర్శించిన పోలీస్ బృందంతో ఎస్పీ సింధుశర్మ



ఫిరంగిని పరిశీలిస్తున్న ఎస్పీ సింధుశర్మ


నిజాంసాగర్: శతాబ్దాల చరిత్ర కలిగిన కౌలాస్ కోటలోని కట్టడాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా, అబ్బుర పరిచేలా ఉన్నాయని ఎస్పీ సింధు శర్మ పేర్కొన్నారు. ఆదివారం జుక్కల్ మండలంలోని కౌలాస్ కోటను ఎస్పీ సింధు శర్మ పోలీస్ బృందంతో సందర్శించారు. కోటలో ఉన్న పొడవైన ఫిరంగి, బురుజు, రామాలయం, వెంకటేశ్వరాలయం, దుర్గామాత, ఎల్లమ్మ ఆలయాలు, ఏనుగులు స్నానాలు చేసే బావిని సందర్శించారు. ఆయా కట్టడాలు, వాటి ప్రాముఖ్యతను స్థానికులు ఆమెకు వివరించారు. ఆమె వెంట కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, బిచ్కుంద సీఐ నరేశ్, జుక్కల్ ఎస్సై సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నేడు త్రిపుర గవర్నర్ పర్యటన

ఆర్మూర్: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సోమవారం ఆర్మూర్ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు బీజేపీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు బాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుత్పలోని అపురూప వేంకటేశ్వరస్వామి ఆలయం, అంకాపూర్‌లోని లాలన వృద్ధాశ్రమం, ఆర్మూర్‌లోని నవనాథ సిద్దుల గుట్టను ఆయన సందర్శిస్తారని పేర్కొన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు లోక భూపతిరెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డితో సమావేశాల్లో పాల్గొంటారని తెలిపారు.

ఈసారైనా ఎన్నికలు జరిగేనా?

- రిజర్వేషన్ ఎస్టీ.. తండావాసులంతా బీసీలు..
- ఎన్నికలకు నోచుకోని కాటేపల్లి తండా పంచాయతీ
- ఆరేళ్లుగా ప్రత్యేకాధికారి పాలనలోనే..



కాటేపల్లి తండా పంచాయతీ ముఖచిత్రం

పెద్దకొడప్‌గల్: రిజర్వేషన్ అనుకూలించక పోటీకి దూరమైన నేతలున్నారు. కానీ జిల్లాలో ఏకంగా ఓ పంచాయతీనే ఎన్నికలకు దూరమైంది. ఊరంతా బీసీలే ఉండగా.. ఎస్టీ రిజర్వేషన్ ఖరారు కావడమే ఇందుకు కారణం. ఈసారైనా ఎన్నికలు జరుగుతాయా అన్న సందిగ్ధంలో ఆ తండావాసులున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ప్రభుత్వం వరుసగా జిల్లాలు, మండలాలు, గ్రామాల పునర్విభజన ప్రక్రియ చేపట్టింది. జిల్లాలో 23 పంచాయతీలతో పెద్దకొడప్‌గల్‌ను మండలంగా ఏర్పాటు చేసిన సర్కారు.. కాటేపల్లి తండానూ పంచాయతీగా చేసింది. ఈ తండాలో నివసించేదంతా మధుర లంబాడాలే.. అయితే మధుర లంబాడాలు బీసీ జాబితాలో ఉన్నారు. 2018లో పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఈ తండాను ఎస్టీలకు రిజర్వ్ చేశారు. గ్రామంలో ఎస్టీ ఒక్కరు కూడా లేకపోవడంతో ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో కాటేపల్లి తండా ఐదేళ్లపాటు ప్రత్యేకాధికారి పాలనలోనే ఉండిపోయింది. పాలకవర్గం లేకపోవడంతో పెద్దగా అభివృద్ధి జరగలేదని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తండా నిండా సమస్యలే..

కాటేపల్లి తండాలో డ్రెయినేజీలు లేవు. దీంతో మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. విద్యుత్ దీపాలు కూడా లేవు. తండాకు వెళ్లే దారి గుంతలమయంగా ఉంది. పంచాయతీ పాలకవర్గం ఉండి ఉంటే ఆయా సమస్యలపై దృష్టి సారించేదని పేర్కొంటున్నారు. ఆరేళ్లుగా ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతుండడంతో తండా అభివృద్ధికి నోచుకోవడం లేదంటున్నారు. ఈసారైనా ఎన్నికలు జరిగేలా చూడాలని కోరుతున్నారు.

రిజర్వేషన్ మార్చాలి



గత పంచాయతీ ఎన్నికలలో మా తండాకు ఎస్టీ రిజర్వేషన్ ఇచ్చారు. మేం బీసీలలో ఉన్నాం. దీంతో ఆరేళ్లుగా ప్రత్యేకాధికారి పాలనే కొనసాగుతోంది. ఈసారి రిజర్వేషన్ మార్చి ఎన్నికలు జరిగేలా చూడాలి.

– బర్దవాల్ జగదీశ్, కాటేపల్లి తండావాసి

అభివృద్ధి కుంటుపడింది



సర్పంచ్ లేక మా తండా అభివృద్ధిలో కుంటుపడింది. అధికారులు స్పందించి ఈ సారైనా పంచాయతీ ఎన్నికలలో ఎస్టీ రిజర్వేషన్ కాకుండా బీసీ రిజర్వేషన్ వచ్చేలా చూడాలి. తండాను అభివృద్ధి చేయాలి.

– గోతి మాన్‌సింగ్, కాటేపల్లి తండావాసి

ఉన్నతాధికారులకు నివేదించాం

గతంలో పంచాయతీ ఎన్నికలలో కాటేపల్లి తండాకు ఎస్టీ రిజర్వేషన్ వచ్చింది. తండావాసులు అందరూ బీసీలే ఉండడంతో ఎన్నికలు జరగలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం.

– లక్ష్మీకాంత్ రెడ్డి, తండా ప్రత్యేకాధికారి, ఎంపీడీవో

క్లుప్తంగా

మెంగారంలో ఎలుగుబంటి సంచారం

లింగంపేట: మండలంలోని మెంగారం, చింతల్ గుట్ట తండాల శివారులో శనివారం రాత్రి పలువురికి ఎలుగుబంటి కనిపించడంతో భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళ రోడ్డుపై వెళ్తున్న వాహన చోదకులకు రోడ్డుపై ఎలుగుబంటి కనిపించడంతో భయాందోళనకు గురై అరగంట పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిపివేశారు. ఎలుగుబంటి రోడ్డుపై పరుగెడుతూ కనిపించినట్లు ప్రయాణికులు తెలిపారు. పక్కనే ఉన్న అడవిలోకి వెళ్లినట్లు గుర్తించారు. గత ఏడాది చింతల్ గుట్ట తండా పక్కనే ఉన్న చెరువులోకి ప్రతి రోజు వచ్చి నీరు తాగి వెళ్లడం తండావాసులు గుర్తించారు. ఈ ఏడాది చింతల్‌గుట్ట రోడ్డుపై ఎలుగుబంటి కనిపించినట్లు తండావాసులు తెలిపారు. రాత్రివేళ ఈ రోడ్డు గుండా ప్రయాణం చేయాలంటేనే భయమేస్తోందని తండావాసులు పేర్కొంటున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం




భిక్కనూరు: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి సామగ్రి దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. దళితవాడకు చెందిన ద్యాగల కృష్ణ తన కుటుంబంతో కలిసి ఆదివారం అంగడికి వెళ్లాడు. తిరిగి ఇంటికి చేరుకోగా ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని గమనించి కేకలు వేశాడు. దీంతో చుట్టుపక్కల అక్కడికి చేరుకొని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కాగా అప్పటికే ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. ఇంటి పై కప్పు సైతం కాలడంతో నీటితో చల్లార్చారు. పెద్ద ప్రమాదం తప్పిందని కాలనీవాసులు పేర్కొన్నారు.

'గ్రంథాలయాల సమస్యలను పరిష్కరిస్తా'



ఆర్మూర్: గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి అన్నారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్‌తో కలిసి సందర్శించారు. పాఠకులతో మాట్లాడి గ్రంథాలయ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రంథాలయాల్లో చల్లని నీటి సౌకర్యం కల్పిస్తున్నా మన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తా మని, మూత్రశాలలను నిర్మిస్తామని పేర్కొన్నారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భవనం పూర్తి కాగానే డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తామన్నారు. గ్రంథాలయాల సేవల ను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇందూరు పర్యటన కొత్త అనుభవం

మెప్మాతో మహిళలు ఆర్థికంగా బలోపేతం



మెప్మాతో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం బాగుంది. చిన్న చిన్న సంఘాలుగా ఏర్పాటు చేసుకుని స్వయంగా వారే నిర్వహించుకోవడం అద్భుతం. మహిళలు వారి అభిరుచులకు అనుగుణంగా ఎంచుకున్న రంగాల్లో వారికి శిక్షణ ఇవ్వాలి. మున్సిపల్ కౌన్సిలింగ్ హాల్ బాగుంది. చిన్నపాటి అసెంబ్లీలా ఉంది. అధునాతనంగా తీర్చిదిద్దడం ఎక్కడో ఫారిన్‌లో ఉన్నట్లు అనిపించింది.

– ఒవాయిస్ బేగ్, జమ్మూ కశ్మీర్

ఆరోగ్య కేంద్రాలు బాగున్నాయి



గ్రామాలతో పాటు పట్టణాల్లో సైతం పేద రోగులపై ప్రభుత్వ కృషి అభినందనీయం. హెల్త్ సెంటర్ల నిర్వహణ బాగుంది. రోగులకు ఉచితంగా మందులు ఇవ్వడం, పరీక్షలు చేయడం గమనించాం. కానీ హెల్త్ సెంటర్లలో మౌలిక వసతులు లేవు. తాగడానికి మంచినీరు అందుబాటులో లేకపోవడం ఇబ్బందికరం. డాక్టర్లు, సిబ్బంది, ఆశా వర్కర్ల సేవలు బాగున్నాయి. – దీప ఎల్ఎస్, కేరళ

- మహిళా సంఘాల పనితీరు భేష్
- చెత్త నుంచి ఎరువు తయారీ అదుర్స్
- గ్రేవ్ యార్డ్ యూపీలో కన్నా ఇక్కడే బాగుంది
- గ్రామాల అభివృద్ధికి వీడీసీల ఏర్పాటు అభినందనీయం
- క్షేత్ర పర్యటనలో మిలిటరీ ట్రైనీ ఇంజినీరింగ్ సర్వీసెస్ అధికారులు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ట్రైనీ అధికారులు

నిజామాబాద్ సిటీ: ఇందూరు పర్యటన కొత్త అనుభవాన్ని ఇచ్చిందని న్యూఢిల్లీకి చెందిన మిలిటరీ ట్రైనీ ఇంజినీరింగ్ సర్వీసెస్(ఎంఈఎస్) అధికారులు తెలిపారు. శిక్షణలో ఉన్న 50 మంది అధికారులు వారం రోజుల పాటు ఇందూరులో రెండు బృందాలుగా ఏర్పడి పర్యటించారు. అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో పలుచోట్ల పర్యటించి సమాజంలో జరుగుతున్న వాస్తవాలను తెలుసుకున్నారు. భవిష్యత్తులో వీరు ఇంజినీర్లుగా ఆయా శాఖలకు సేవలు అందించనున్నారు. క్షేత్రస్థాయి పర్యటన తమకు ఎంతో అనుభవాన్ని ఇచ్చిందని పూణె, ఢిల్లీ, హైదరాబాద్‌లో శిక్షణ పొందిన ట్రైనీ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొన్నారు. వీరికి మెప్మా పీడీ రాజేందర్, మున్సిపల్ ప్రాజెక్టు అధికారి చిదుర రమేశ్, అసిస్టెంట్ కమిషనర్ జయకుమార్, ఎంహెచ్ఆర్‌డీ సూపర్‌వైజర్ విజయానంద్‌రెడ్డి ఆయా శాఖలు అందిస్తున్న సేవలను దగ్గరుండి వివరించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో ట్రైనీ ఇంజినీరింగ్ అధికారులు చూసిన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

దుబ్బ గ్రేవ్‌యార్డ్ బాగుంది



నగరంలోని దుబ్బ గ్రేవ్‌యా ర్డ్ బాగుంది. దీన్ని చూస్తే ఏదో ఫంక్షన్ హాల్ అనుకున్నాం. కానీ అంతిమ సంస్కారాలు చేయడానికి ఇంత విశాలమైన, వసతులతో కూ డుకున్న స్థలం దేశంలో మరెక్కడా లేదు. మా యూ పీలో అధ్వాన్నంగా ఉంటాయి. డంపింగ్‌యార్డు, వాటర్ సప్లై చేసే ఫిల్టర్‌బెడ్‌లు బాగున్నాయి. మున్సిపల్ పార్కులు సైతం ఆహ్లాదంగా, పరిశుభ్రంగా అనిపించాయి. – ప్రియాంక్, ఉత్తరప్రదేశ్

పాఠశాలల్లో వసతులు కరవు



గ్రామాల్లో, పట్టణాల్లో ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించాం. కనీస వసతులు కరువయ్యాయి. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి సరైన స్థలం లేదు. మూత్రశాలలు లేవు. నగరంలో సైతం ట్రాఫిక్ నియంత్రణ లేదు. వాహనదారులు సురక్షిత విధానాలు పాటించడం లేదు. తాగునీటి సరఫరా కోసం వాటర్ బెడ్ నిర్వహణ బాగుంది.

– నందన్, రాజమండ్రి

గ్రామాల్లో పారదర్శకంగా పనులు



గ్రామాల అభివృద్ధికి వీడీసీలను ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామం. పలు గ్రామాల్లో జరుగుతున్న పనులు పరిశీలిస్తే పారదర్శకత కనిపించింది. ప్రతి గ్రామంలో మొక్కలు పెంచడం, ట్రాక్టర్ల ద్వారా నీరు పోయడం, పారిశుధ్య పనులు చేయించడం బాగుంది. మున్సిపల్ కౌన్సిలింగ్ హాల్ బాగుంది. చిన్నపాటి అసెంబ్లీలా ఉంది. గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో ఉండటం ఆరోగ్యకరమైన గ్రామాలుగా ఏర్పడేందుకు దోహదపతాయి.

– గొల్లంగి సతీశ్, శ్రీకాకుళం

డంపింగ్ యార్డును పరిశీలించాం



ట్రైనీ అధికారులందరం డంపింగ్ యార్డును క్షుణ్ణంగా పరిశీలించాం. ప్రతి రోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించడం ఆశ్చర్యం అనిపించింది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి ప్లాస్టిక్‌ను వేరుచేసే ప్రక్రియ బాగుంది. చెత్త నుంచి ఎరువులు తయారీ చేయడం అభినందనీయం. కానీ ప్లాస్టిక్ వినియోగం చాలా అధికంగా కనిపించింది. పాలిథిన్ నగరంగా జిల్లాను మార్చాలి. హెల్త్ సెంటర్ల నిర్వహణ బాగుంది.

– మౌనిక, ఛత్తీస్‌గఢ్

మోర్తాడ్ సీహెచ్‌సీలో ప్రసవాలు బంద్

- మూడేళ్లుగా గైనకాలజిస్ట్ లేక అవస్థలు
- ఆర్మూర్‌కు వెళ్తున్న గర్భిణులు



మోర్తాడ్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడానికి మార్పు కార్యక్రమాన్ని చేపట్టినా మోర్తాడ్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మాత్రం ప్రసవ సేవలు కొనసాగడం లేదు. గైనకాలజిస్ట్(స్త్రీ వైద్య నిపుణురాలు), అనస్తేషియా(మత్తు) వైద్యురాలు లేకపోవడంతో మూడేళ్ల నుంచి మోర్తాడ్‌లో ప్రసవ సేవలు నిలిచిపోయాయి. దీంతో ఈ ప్రాంత గర్భిణులు ప్రసవానికి ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి లేదా ప్రైవేటు ఆస్పత్రులకు తరలుతున్నారు. మోర్తాడ్ ఆస్పత్రిని వైద్య విధానపరిషత్‌లో విలీనం చేశారు. వైద్య విధానపరిషత్‌లో విలీనమైనా సేవలు మెరుగుపడటం లేదు.

మోర్తాడ్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలో మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, వేల్పూర్, భీమ్‌గల్ మండలాలు ఉన్నాయి. అయితే సాధారణ ప్రసవాలను చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్నారు. శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవాలను మా త్రం మోర్తాడ్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లోనే నిర్వహిస్తున్నారు. 2018లో మోర్తాడ్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స ద్వారా ప్రసవాలు ఆరంభమయ్యాయి. మా ర్పు పథకం అమలుతో మోర్తాడ్ ఆస్పత్రిలో రికార్డు స్థాయిలో ప్రసవాలు జరిగాయి. అయితే రెండేళ్ల నుంచి ఒక్క ప్రసవం కూడా జరగలేదు. ఇక్కడి ఆ స్పత్రిలో వైద్యులు ఉన్నా వారిలో గైనకాలజిస్ట్, అనస్తేషియాలు లేక పోవడంతో ఆర్మూర్ నుంచి ప్రైవే టు వైద్యులను పిలిపించి వారితో శస్త్ర చికిత్సలు చేయించాల్సి వచ్చింది. ప్రతి బుధ, శుక్రవారాల్లో గర్భిణులకు శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవం చేశారు.

శస్త్ర చికిత్స ద్వారా ప్రసవం చేసినందుకు గైనకాలజిస్టుకు రూ.2,500 అనస్తేషియాకు రూ.2,500 చొప్పున చెల్లించేవారు. గైనకాలజిస్టులు, అనస్తేషియాలు మోర్తాడ్ ఆస్పత్రికి రావడానికి ఆసక్తి చూపకపోవడంతో ప్రసవ సేవలు నిలిచిపోయాయి. ఎంతో మంది పేదలు, మధ్య తరగతి కుటుంబాల వారు ప్రసవం కోసం మోర్తాడ్ ఆస్పత్రికి వస్తుండగా ఇక్కడ ప్రసవ సేవలు చేయకపోవడంతో వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం కోసం వెళ్తున్నారు. అక్కడ రద్దీ ఎక్కువ ఉంటే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో భారీగా ఫీజు వసూలు చేస్తుండటంతో పేదలకు, మధ్య తరగతి కుటుంబాల వారికి ఆర్థిక భారం ఏర్పడుతోంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ప్రసవ సేవలను మోర్తాడ్‌లో పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 1973-74 బ్యాచ్ ఏడోతరగతి రాధాకృష్ణ విద్యాలయ విద్యార్థులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని రాధాకృష్ణ విద్యాలయంలో 1973–74లో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఆర్యసమాజ్ మందిర్‌లో నిర్వహించారు. 64 ఏళ్ల తర్వాత అందరూ ఒకే చోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు చదువులు చెప్పిన గురువులు నాగయ్య, పురం శంకర్‌ను సన్మానించి పాదాభివందనం చేశారు. తాము చదువుకున్న విద్యాలయానికి వాటర్ ట్యాంక్, ఎలక్ట్రిక్ మోటారును వితరణ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె బాబు, ఎం నాగభూషణం, మీసాల సుధాకర్ రావు, సీహెచ్ రాజారాం, ఏఎస్ సాంబయ్య, లక్ష్మీనర్సయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001–2002కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుండెరావు, చంద్రశేఖర్, హరిత, శ్రీనివాస్, విద్యార్థులు సలీం, హనుమప్ప, శ్రీహరి, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

హైవేపై కనువిందు చేస్తున్న పూల మొక్కలు



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో నేషనల్ హైవే రోడ్డు మధ్యలో డివైడర్‌పై నాటిన పూల మొక్కలకు కాసిన పువ్వులు కనువిందు చేస్తున్నాయి. రోడ్డు పొడవునా రంగు రంగుల పువ్వులు పోయే వాహనదారులకు ఆకర్షిస్తున్నాయి. చాలా మంది వాహనాలు ఆపి రంగు రంగుల పువ్వుల వద్ద సెల్ఫీలు దిగుతున్నారు.



క్రైం కార్నర్

కాలువలో పడి భగీరథ ఉద్యోగి గల్లంతు



కాలువలో గాలిస్తున్న యువకులు



విఠల్(ఫైల్)

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండల శివారులో ఉన్న నిజాంసాగర్ ప్రధాన కాలువలో ఆదివారం కర్రె విఠల్ అనే మిషన్ భగీరథ ఇంట్రాసెక్షన్ హెల్పర్ గల్లంతయ్యాడు. ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన విఠల్ వీఆర్ఏగా పని చేసి గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ ఇంట్రాసెక్షన్‌లో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే నిజాంసాగర్ ప్రధాన కాలువలో ఉన్న చేపను పట్టుకునేందుకు వెళ్లిన అతను నీట మునిగి గల్లంతైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ మేరకు స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై శివకుమార్ అక్కడి చేరుకున్నారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు కొనసాగుతున్న నీటి విడుదలను నిలిపి వేయించారు. చీకటి అయ్యేంత వరకు యువకులు ప్రధాన కాలువలో గాలించినా ఆచూకీ లభించలేదు.

జక్కాపూర్‌లో మిల్లర్ బోల్తా



నిజాంసాగర్: మండలంలోని జక్కాపూర్ గ్రామ బస్టాండ్ వద్ద ఆదివారం మెగా కంపెనీ మిల్లర్ బోల్తా పడింది. నాగమడుగు ఎత్తిపోతల పనులకు కాంక్రీట్ మాల్ తరిస్తున్న క్రమంలో మిల్లర్ బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రాణనష్టం జరగలేదు.

ఇరు వర్గాల ఘర్షణ

ఖలీల్‌వాడి: నగరంలోని ఆటోనగర్‌లో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. చిన్న గొడవతో మొదలైన వివాదం యువకుల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ గొడవ ఆటోనగర్ దయా బ్రిడ్జి వద్ద మజీద్ ఏ ఆయేషా ప్రాంతంలో జరిగింది. ఈ విషయమై ఆరో టౌన్ ఎస్సై వెంకట్రామ్‌ను వివరణ కోరగా ఘర్షణ విషయమై ఇరువర్గాలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి చెరువులో శవమై

- నడుముకు బండ కట్టుకొని ఆత్మహత్య
- ఎల్లారెడ్డిపల్లెలో ఘటన



వంశి(ఫైల్)

ఇందల్వాయి: ఇంటి నుంచి వెళ్లిపోయిన ఎల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన అగ్గు వంశి(27) అనే యువకుడు గ్రామంలోని దక్కల్ చెరువులో ఆదివారం ఉదయం శవమై కనిపించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంశి గురువారం రాత్రి ఇంట్లో నుంచి ఆవేశంతో వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులకు చెరువులో మృతదేహం ఉందని సమాచారం అందడంతో అక్కడకి వెళ్లి బయటకు తీయడంతో అది వంశీదేనని పోలీసులు నిర్ధారించి పోస్టుమార్టానికి తరలించారు. ఈత వచ్చిన వంశి నడుముకు బండ కట్టుకొని మరీ చెరువులో దూకడం గమనార్హం. పదో తరగతి వరకు చదువుకున్న వంశి గల్ఫ్ నుంచి మూడేళ్ల కిందట వచ్చి వ్యవసాయం చేస్తున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు.

అంతుచిక్కని వైరస్‌తో కోళ్ల మృత్యువాత

- బోర్లంక్యాంప్‌లో రెండు వేల కోళ్లు మృతి



బోర్లం క్యాంప్‌లోని కోళ్ల ఫారంలో మృతి చెందిన కోళ్లు

బాన్సువాడరూరల్: అంతుచిక్కని వైరస్‌తో బాన్సువాడ డివిజన్‌లో బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. తాజాగా మండలంలోని బోర్లం క్యాంప్‌లో ఆదివారం సుమారు రెండు వేల కోళ్లు వైరస్‌బారిన పడి మృతి చెందాయి. మూడు రోజుల క్రితం వరకు ఆరోగ్యంగా ఉన్న కోళ్లు రెండు రోజుల్లోనే అస్వస్థతకు గురై మృతిచెందాయని ఫారం నిర్వాహకుడు బోడ చందర్ తెలిపారు. ఇప్పటికే బీర్కూర్ మండలం కిష్టాపూర్, చించోలి, బాన్సువాడ మండలం తిర్మలాపూర్ గ్రామాల్లో సుమారు ఆరు వేలకు పైగా కోళ్లు ఇదేవిధంగా చనిపోయాయి. మృతి చెందిన కోళ్లను జేసీబీతో గుంతలు తీసి పూడ్చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుమారు రెండు కేజీల బరువు వరకు పెరిగి మార్కెట్‌కు తరలించాల్సిన తరుణంలో కోళ్లు మృత్యువాత పడుతుండడంతో కోళ్ల ఫారాల నిర్వాహకులు తీవ్రంగా నష్టపోతున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువులో శుక్రవారం సాయంత్రం గల్లంతైన యువకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పట్టణంలోని ఆర్‌బీ నగర్ కాలనీకి చెందిన చిన్నచెవ్వ సాయికుమార్ (24) అనే యువకుడు తన తండ్రితో కలిసి బట్టలు ఉతికేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువు నీటిలో గల్లంతైన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం చీకటిపడిన తర్వాత గాలింపు చర్యలు నిలిపివేసిన పోలీసు, అగ్నిమాపక సిబ్బంది గజ ఈతగాళ్లతో కలిసి శనివారం ఉదయం నుంచి చెరువులో గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

శివాజీ విగ్రహం అపహరణ



నిజాంసాగర్: జుక్కల్ మండలంలోని సోపూర్ వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్సై సత్యనారాయణ ఆదివారం తెలిపారు. రెండు ఫీట్లతో కూడిన శివాజీ విగ్రహాన్ని గ్రామస్తులు విగ్రహంపై ప్రతిష్ఠించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు



వివరాలు తెలుపుతున్న ఎస్సై ఆంజనేయులు

భిక్కనూరు: మండలంలోని నాలుగు గ్రామాల్లో గంజాయి సేవిస్తూ విక్రయిస్తున్న ఎనిమిది మంది యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు ఆదివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన పాల్వంచ భరత్, బేతి నిఖిల్, బసగళ్ల నరేందర్, ర్యాగట్లపల్లికి చెందిన మంతూరి విఘ్నేశ్, జంగంపల్లి గ్రామానికి చెందిన మెరుపుల విఘ్నేశ్, చాకలిపోషి బాలంజనేయులు, గోత్రాల వంశీ, రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన సోమిశెట్టి నాగరాజులు పలుచోట్ల గంజాయి సేవిస్తూ అమాయకపు యువకులకు విక్రయిస్తూ పట్టుబడ్డారన్నారు. వీరు మహారాష్ట్ర నుంచి గంజాయిని తీసుకొచ్చి సేవిస్తూ విక్రయిస్తున్నారన్నారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి వీరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.